క్లుప్తంగా

ఆలయంలో డీసీపీ పూజలు



భక్తులతో డీసీపీ దంపతులు

జనగామ: పట్టణంలోని గుండ్లగడ్డ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్ దంపతులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకం చేసిన అనంతరం వేదపండితులు గంగు సాంబమూర్తి.. డీసీపీ దంపతులకు ఆశీర్వచనం చేసి సత్కరించారు. కార్యక్రమంలో భక్తులు ప్రకాశ్, ప్రభాకర్, రమ, రాణి, ప్రవీణ్, త్రయంబకేష్, నవీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ శుభ్రం

సాక్షి ఎఫెక్ట్..



శుభ్రం చేసిన డ్రెయినేజీ

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట గ్రామంలో 'పారిశుద్ధ్యం అస్తవ్యస్తం' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. గురువారం జీపీ అధికారులు సిబ్బందితో డ్రెయినేజీలోని చెత్తాచెదారం, మురుగు తొలగింపజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ వీధుల్లో క్లోరినేషన్ కూడా చేయిస్తామన్నారు. శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

'ఆరోపణలు సరికాదు'



మాట్లాడుతున్న శ్రీధర్‌రావు

చిల్పూరు: చిల్పూరు ఆలయ చైర్మన్ పదవి కోసం తాను ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రూ. కోటి ఇచ్చినట్లు బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే రాజయ్య తనపై ఆరోపణలు చేయడం సరికాదని చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. పల్లగుట్ట గ్రామంలో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీధర్‌రావు మాట్లాడారు. తాను మూడు దఫాలుగా మాజీ ఎమ్మెల్యే రాజయ్య సమక్షంలో ఆలయ చైర్మన్‌గా పనిచేశానని సమయంలో ఆలయ అభివృద్ధికి రూ. 10 కోట్లు మంజూరు చేయిస్తానని హామీలు ఇచ్చి నెరవేర్చకపోవడంతో సొంత డబ్బులు రూ. 50 లక్షల వరకు వెచ్చించి ఆలయాన్ని అభివృద్ధి చేశానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తిరిగి కడియం శ్రీహరి అందరి కోరిక మేరకు నూతనంగా ఆలయ కమిటీ వేసి తనను చైర్మన్‌గా ఎంపిక చేశారని ఈవిషయంలో ఎప్పుడు పదవి కోసం అడగలేదన్నారు. రాజయ్య లేనిపోని ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో ఆలయ ధర్మకర్త తాళ్లపల్లి బుచ్చయ్య, మండల అధ్యక్షుడు సురేష్, నాయకులు బాలరాజు, చిర్ర నాగరాజు తదితరులు ఉన్నారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి



చిల్పూరు: ఈనెల 27వ తేదీన హనుమకొండలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద గురువారం ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ రమేష్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ రజతోత్సవ సభకు మండలం నుంచి 5వేల మందిని నాయకులు తరలించాలని అన్నారు. నాయకులు నారగోని రాజు, జనగాం యాదగిరి, బత్తుల రాజన్‌బాబు, మాచర్ల ప్రవీణ్, యాకూబ్, వెంకటస్వామి, ఎడ్ల మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



పాలకుర్తి టౌన్: దర్దేపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం రిటైర్డ్ ఉపాధ్యాయుడు సిద్దం వాసుదేవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సిద్దం కృష్ణదేవ్, ఇమ్మడి ప్రకాశ్, సమ్మయ్య, దండయ్య, కుమారస్వామి, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు తప్పని తిప్పలు

- వంగాలపల్లి వద్ద తరుచూ పడుతున్న రైల్వేగేటు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి

చిల్పూరు: మండలంలోని వంగాలపల్లి మీదుగా ఖమ్మం హైవే రోడ్డుకు వెళ్లే మార్గంలో జాతీయ రహదారికి సమీపంలో రైల్వే గేట్ ఉంది. ఈ గేటు తరుచూ పడుతుండటంతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతంలో గేటు వద్ద రైళ్ల రాకపోకలు తక్కువగా ఉండడంతో ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. కానీ ప్రస్తుతం వంగాలపల్లి మీదుగా పుణ్యక్షేత్రం అయిన ఐనవోలు, ఖమ్మం రోడ్డుకు వెళ్లేందుకు దగ్గరి రహదారి ఇదే కావడంతో వాహనాల రాకపోకలు పెరిగాయి. దీనికి తోడు రైళ్ల రాకపోకలు కూడా ఎక్కువవడంతో ప్రతీ 10 నిమిషాలకోమారు గేటు పడుతోంది. ఒక్కోసారి గేట్ తీయడానికి 15 నుంచి 20 నిమిషాలు కావస్తుండటంతో వాహనదాలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో రైల్వే గేట్ పక్క నుంచి నష్కల్ రైల్వే అండర్ బ్రిడ్జి వరకు రోడ్డు ఉండేది. గేట్ పడితే అత్యవసరం ఉన్న వాహనదారులు ఆ రోడ్డు మీదుగా వెళ్లేవారు. ప్రస్తుతం దాన్ని మూసి వేయడంతో గేట్ తీసేవరకు వాహనదారులు వేచిచూడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి పాత రోడ్డును పునరుద్ధరించాలని కోరుతున్నారు.



వంగాలపల్లి వద్ద వేసి ఉన్న రైల్వే గేటు

ద్విచక్రవాహనాలు వెళ్లేలా ఉంటే బాగుండు..



వంగాలపల్లి వద్ద రైల్వే గేట్ పడితే ఒక్కోసారి 4 రైళ్లు వచ్చి వెళ్లే వరకు తెరువక పోవడంతో అరగంట వేచి చూడాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనాలు వెళ్లేలా ఏర్పాట్లు చేసినా బాగుండేది. గేట్ సమీపంలో కనీసం చెట్ల నీడ కూడా లేదు.

– రాజు, స్థానికుడు

కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్తా..



వంగాలపల్లి రైల్వేగేటు వాహన చోదకులకు ఇబ్బందిగా ఉంది. అత్యవసరంగా వెళ్లే వారికి వేరే మార్గం లేక గేటు తీసే వరకు వేచిచూడాల్సి వస్తోంది . గతంలో ఉన్న పాత రోడ్డును పునరుద్ధరించేలా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తా.

– గంటె ఉపేందర్‌యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు

'రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన పార్టీ కాంగ్రెస్'



మాట్లాడుతున్న శివరాజ్ యాదవ్

తరిగొప్పుల: గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న జై బాపు, జైభీం, జై సంవిధాన్ పాదయాత్రలు నాటకము,బూటకమని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను రెండు సార్లు ఓడించిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, ఆయనకు భారతరత్న బిరుదునిచ్చి గౌరవించింది బీజేపీ అని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శోభన బోయిన శివరాజ్ యాదవ్ అన్నారు. మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో బీజేపీ క్రియాశీల సభ్యుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరాజ్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలో ప్రతీ కార్యకర్త శ్రమించి పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వమే సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. ఏడెల్లి రాంనర్సింహారెడ్డి, శ్రీనివాస్, రజనీకాంత్, సతీష్, రాజు యాదవ్, వెంకటేష్, శ్రీకాంత్, సుమన్ నాయక్, అరవింద్, రాజశేఖర్, హరీష్, రంజిత్, అనిల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి



బొమ్మకూర్‌లో ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న శ్వేత, నర్సింహారెడ్డి

నర్మెట: కాంగ్రెస్ పాలనలోనే పేదలు అభివృద్ధి చెందారని, వారి సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్లతోనే సాధ్యమయ్యిందని చేర్యాల మార్కెట్‌కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేత, డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి అన్నారు. ఎన్నికల హామీలను ఒక్కొటిగా అమలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ గ్రామంగా ఎంపికైన బొమ్మకూర్‌లో గురువారం ఇందిరమ్మ ఇళ్లకు వారు ముగ్గుపోసి మాట్లాడారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, నాయకులు భూక్య జయరాం, ఫరీదుల యాదయ్య, యసర్ల అంజయ్య, ధరావత్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



పాలకుర్తి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మంజుల

పాలకుర్తి: రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని చిట్యాల ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని మల్లంపల్లి బిక్యా నాయక్ తండా, కొండాపురం పెద్ద తండా, బమ్మెర, అయ్యంగారి పల్లి, కోతులబాద, దుబ్బతండా, తీగారం, మంచుప్పుల తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంజుల ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనుమల మల్లారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, ఎం.డి మదార్, ఎర్రబెల్లి రాఘవరావు, అడ్డూరి రవీందర్‌రావు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పనను సద్వినియోగం చేసుకోండి

దేవరుప్పుల: ప్రభుత్వ అన్నదాతలకు కల్పించే గిట్టుబాటు ధరను సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం జిల్లా అధికారి రాజేందర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తితో కలిసి ఆయన ప్రారంభించారు. అలాగే రామరాజుపల్లి, రంబోజీగూడెంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొడకండ్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్ల అండాలు శ్రీరాములు ప్రారంభించారు. పీఏసీఎస్ సీఈఓ కృష్ణమూర్తి, ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి, పురుషోత్తం , పెండ్లి సోమిరెడ్డి, నాయకులు పాలొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకే పాదయాత్రలు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జనగామ రూరల్: రాజ్యాంగ పరిరక్షణ కోసం పాదయాత్రలు చేపడుతున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ అన్నారు. జై బాపు జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో భాగంగా గురువారం మండలంలో పలు గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, డాక్టర్ రాజమౌళి చెంచారపు కరుణాకర్ రెడ్డి, వంగల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి



బహుమతి అందుకున్న విద్యార్థులు

బచ్చన్నపేట: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కట్కూర్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం జిల్లెల్ల రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయుడు మేకల శ్రీనాథ్ నగదు బహుమతి అందజేశారు.

పెంచిన ధరలు తగ్గించాలి

- సీపీఎం నాయకుల డిమాండ్



పాలకుర్తి: నిరసన తెలుపుతున్న నాయకులు

చిల్పూరు/బచ్చన్నపేట/పాలకుర్తి: కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం పలు మండల కేంద్రాల్లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పెట్రోల్, గ్యాస్, నిత్యావసరాల ధరలను పెంచి పేదల నడ్డి విరుస్తోందన్నారు. వెంటనే ధరలు తగ్గించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు చిట్యాల సోమన్న, మాచర్ల సారయ్య, బెల్లంకొండ వెంకటేశ్, సాదం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడికి పిల్లలను పంపండి



ఇంటింటా ప్రచారం చేస్తున్న హెచ్‌ఎం అంజయ్య

దేవరుప్పుల: ప్రభుత్వ బడి పిల్లలు–ప్రతిభ కలిగిన పిడుగులు అనే పిలుపుతో మా సర్కారు బడికి మీ పిల్లలను పంపితే ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేస్తామని ఇంటింటా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గురువారం సింగరాజుపల్లిలో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అంబటి అంజయ్య మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల మోజులో పడి పిల్లలను బట్టీ మార్కుగా తయారు చేస్తున్న క్రమంలో సకల సౌకర్యాలు కలిగిన సర్కారు బడిని వినియోగించుకునేందుకు గుర్తించిన నిర్దేశిత 30 కుటుంబాలకు అవగాహన కల్పించామన్నారు. ఆంగ్లమాధ్యమంలో సృజనాత్మకతతో కూడిన విద్యాబోధనలు చేసి బాలబాలికల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తామని హామీ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మాధవి, సునిత, చైతన్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ నోముల పద్మ పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



లింగాలఘణపురంలో రోడ్డుపై కూలిన చెట్టను తొలగిస్తున్న పోలీసులు, పంచాయితీ సిబ్బంది

- రాలిన వరి ధాన్యం, కూలిన చెట్లు

లింగాలఘణపురం: మండలంలో గురువారం సాయంత్రం కురిసిన గాలివానతో పాటు స్వల్పంగా వడగళ్లు కురిశాయి. దీంతో చేతికొచ్చే దశలో ఉన్న వరి ధాన్యం నేలరాలింది. అదేవిధంగా మండల కేంద్రంలో రోడ్లపై చెట్లు కూలిపోయి అంతరాయం ఏర్పడగా స్థానిక పోలీసులతో పాటు పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ చెట్లను తొలగించి రాకపోకలు జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. వనపర్తితో మూడు విద్యుత్ స్తంభాలు కూలి అంతరాయం ఏర్పడింది. వడగళ్లతో వరి ధాన్యం నష్టంపై ఏఓ వెంకటేశ్వర్లును ప్రశ్నించగా ఇప్పటి వరకు నష్టం వివరాలాలు రాలేదని, స్వల్పంగా వడగళ్లు కురిసిన సమాచారం ఉందని తెలిపారు.

దేవరుప్పుల మండలంలో..

దేవరుప్పుల: మండలంలోని పలు గ్రామాల్లో గాలిదుమారంతో కురిసిన వర్షపు జల్లులతో గురువారం రాత్రి అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కోతకు వచ్చిన వరి పంట నేల ఒరిగిపోతుందని రైతులు వాపోతున్నారు. వర్షంతో ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు అనేక పాట్లు పడ్డారు.



దేవరుప్పుల: సింగరాజుపల్లి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవకుండా రైతుల యత్నాలు



రఘునాథపల్లి: ఖిలాషాపూర్‌లో వడగండ్లతో దెబ్బతిన్న వరి పంట

ఈదురు గాలులు, వడగండ్లు

రఘునాథపల్లి: పది రోజుల్లో ఇంటికి చేరాల్సిన వరి పంట ఈదురు గాలులతో కురిసిన వడగళ్లతో దెబ్బతింది. గురువారం సాయంత్రం వడగండ్లతో వీచిన బీభత్సానికి ఖిలాషాపూర్, ఇబ్రహీంపూర్, ఫతేషాపూర్, మంగళిబండతండా, లక్ష్మీతండా, కోమళ్లలో వరి గింజలు నేలపాలయ్యాయి. అదే విధంగా చేతి కందిన మొక్కజొన్న, మామిడి పంటలకు నష్టం జరిగింది. నేలరాలిన వడ్లగింజలను చూసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కన్నాయపల్లిలో ఈదురు గాలుల భీభత్సానికి రెండు విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి.

దమ్ముంటే కబ్జా నిరూపించండి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు



మాట్లాడుతున్న రాంబాబు

రఘునాథపల్లి: కబ్జాకు పాల్పడినట్టు నిరూపిస్తే మీ ఇళ్లలో గులాంగిరి చేస్తానన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్‌ను దమ్ముంటే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యలు స్వీకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కబ్జా నిరూపించని పక్షంలో వారిద్దరు కడియం ఇంట్లో గులాంగిరి చేయాలన్నారు. క్షేత్రస్థాయికి వస్తే కబ్జా నిరూపిస్తా అని రాజయ్య అనడం హాస్యాస్పదమని, ఇద్దరినీ ఒకే సారి పోలీసులు అనుమతించరని తెలిసే ఆయన అలా మాట్లాడుతున్నాడన్నారు. జనగామలో రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్టు చేస్తే దానికి కడియం శ్రీహరి బాధ్యుడని పల్లా మాట్లాడటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మాజీ జెడ్పీటీసీ బొల్లం అజయ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొనాసి క్రాంతికుమార్, మేకల నరేందర్, మంద రమేష్, కావటి భాస్కర్‌యాదవ్, తోటకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సాగునీరు అందించేందుకు సర్వే



కుంటను పరిశీలిస్తున్న అధికారులు

చిల్పూరు: సాగునీటి వసతులు లేని శ్రీపతిపల్లి, లింగంపల్లి, కొండాపూర్ గ్రామాల్లోని చెరువులు, కుంటలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు గురువారం ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించారు. ఇరిగేషన్ ఏఈ కమలాకర్ ఆధ్వర్యంలో గ్లోబల్ ఇంజనీర్లు వాటిని పరిశీలించారు. వారి వెంట రంగు రమేశ్, మాజీ సర్పంచ్ ఏదునూరి రవీందర్, బాలయ్య, సాంబరాజు, రాజ్‌కుమార్, సురేష్, రాజు, శ్రీనివాస్, లింగం తదితరులు ఉన్నారు.

జయప్రదం చేయాలి

జనగామ రూరల్: మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా అంబేడ్కర్ అందరివాడు అనే నినాదంతో నిర్వహించనున్న బహుజన కవి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని దళిత రత్న, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నారపు శివశంకర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జనగామలోని స్కాలర్స్ గ్రామర్ స్కూల్‌లో అంబేడ్కర్ యువజన సంఘం, జిల్లా కమిటీ, సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కవులు కళాకారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ




తరిగొప్పుల: మండల తహసీల్దార్‌గా మొగుళ్ల మహిపాల్‌రెడ్డి గురువారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ నాగేశ్వర్‌రావు పాలకుర్తికి బదిలీ కాగా దేవరుప్పులలో పని చేస్తున్న మహిపాల్‌రెడ్డి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా భూ సమస్యలు ఉంటే నేరుగా తనను కలువాలని, మధ్యవర్తులను ఆశ్రయించొద్దని తెలిపారు.

పాలకుర్తి తహసీల్దార్‌గా నాగేశ్వరాచారి



పాలకుర్తి: మండల నూతన తహసీల్దార్‌గా తరిగొప్పుల నుంచి వచ్చిన ఎం.నాగేశ్వరాచారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎటువంటి భూ సమస్యలు ఉన్నా తనను నేరుగా కలువాలని అన్నారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ శ్రీనివాస్ ఆర్డీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నాగేశ్వరాచారికి నాయబ్ తహసీల్దార్ వేణు, ఆర్‌ఐ రాకేష్‌లు, కార్యాలయ సిబ్బంది ఆహ్వానం పలికారు.

ప్రభుత్వ నిబంధనలతో విధులు నిర్వర్తిస్తా



దేవరుప్పుల: ప్రభుత్వ నిబంధనలతో విధులు నిర్వర్తించేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని తహసీల్దార్ ఆడెపు అండాలు పేర్కొన్నారు. గురువారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీఓ ఏఓగా విధులు నిర్వర్తించే క్రమంలో బదిలీపై వచ్చిన ఆమె విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో నెలకొన్న అపరిష్కృత భూసమస్యలు, పాలన పరమైన అంశాల పరిష్కారం కోసం ఉన్నతాధికారుల సూచనల మేరకు పారదర్శకంగా వ్యవహరిస్తూ మండల అభివృద్ధికి పాటుపడుతామన్నారు.

గిరిజన సంఘం నాయకుల ముందస్తు అరెస్ట్

పాలకుర్తి టౌన్: రాష్ట్ర మంత్రి వర్గంలో గిరిజనులకు స్థానం కల్పించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో రేవంత్ ఇల్లు ముట్టడి పిలుపు ఇవ్వడంతో గురువారం మండల కేంద్రంలో గిరిజన, బంజారా సంఘం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బానోత్ మహేందర్‌నాయక్‌ను పోలీసు ముందుస్తు అరెస్టు చేసిన పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మిస్సింగ్ కేసు నమోదు



అన్నయ్య

చిల్పూరు: ఐదు రోజుల క్రితం పనిపై విజయవాడకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన అతని భార్య పోలీసులను ఆశ్రయించగా మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్నారు. వివరాలు.. మండలంలోని ఫత్తేపూర్ గ్రామానికి చెందిన గుగులోత్ అన్నయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 5వ తేదీన విజయవాడలో పని ఉందని వెళ్లాడు. రెండు రోజుల అనంతరం అతని ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో అన్నయ్య భార్య నిర్మల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

'కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం'

జఫర్‌గఢ్: ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఎం మండల కార్యదర్శి గుండెబోయిన రాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు కల్లాల వద్ద ఆరబోసిన ధాన్యం వాతావరణ మార్పులతో ఎప్పుడు వర్షం వచ్చి తడుస్తుందోనని ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఎండీ షబానా, నక్క యాకయ్య, ఎండీ శంషొద్దీన్, వేల్పుల రవి, వడ్లకొండ రాజు, రాపర్తి రజిత, చిలువేరు మల్లేష్, పులిగిల్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక



సుమ

దేవరుప్పుల: ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శిగా నీర్మాలకు చెందిన దాసగాని సుమ గురువారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడుతామన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యారంగానికి బడ్జెట్‌లో 30% శాతం నిధుల అమలుతోపాటు విద్యాసంస్థల్లో అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

బస్సును ఢీకొట్టిన బొలెరో వాహనం

- ఒకరికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి హనుమకొండవైపుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఘన్‌పూర్ శివారులోని పల్లగుట్ట క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై బొలెరో వాహనం వెనుకనుంచి ఢీకొట్టగా బొలెరో డ్రైవర్ అబ్బరబోయిన సంపత్‌కు తీవ్రగాయాలైన సంఘటన గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీ బస్సు స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి హనుమకొండ వైపుకు వెళ్తుండగా బొలెరో వాహనం నడుపుతున్న చిల్పూరుకు చెందిన సంపత్ వేగంగా వెళ్తూ ఆర్టీసీ బస్సును వెనుకనుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సంపత్‌కు తలకు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌వారికి సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న 108 వాహన ఈఎంటీ హరికృష్ణ, పైలట్ మహేష్‌లు సంపత్‌కు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతున్న సంపత్ పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు తెలిసింది.